
నూరేళ్ళ తెలుగు కథకు నవ్య నీరాజనం - 65



# జీవితాన్ని మించిన కథల భాండాగారం లేదు

**- ద్వివేదుల సోమనాథశాస్త్రి**

ఎక్కే గుమ్మం..దిగే గుమ్మం అంటారు గానీ ఆయన మాత్రం చాసోగారి ఇంటి గుమ్మాన్ని మాత్రమే నమ్ముకున్నారు. ఆ గుమ్మం ఎక్కిన ప్రతీసారి చాసోగారి చేతుల్లో కాగితాల్ని పెట్టేవారు. కళ్ళు చిట్లించి, పంటి బిగువున చుట్టని సంధించి, 'ఏడిసినట్టుంది.. ఇదికాదు కథరాసే పద్ధతి. మళ్లీ రాసుకురా'' అంటూ ఆ కాగితాల్ని చాసో గారు బర్రుమని చించేయగానే ఆయన దిగులు పడలేదు. గుమ్మం దిగుతూనే మరో ఇతివృత్తాన్ని మనసులో ఆవిష్కరించుకునేవారు. మర్నాడు ఉదయాన్నే చాసో గారి గుమ్మం మీద మరో కథతో ప్రత్యక్షమయ్యేవారు. నేటికి అరవై అయిదేళ్లనాడు తొలికథను రాసి, అది రాసిన నాలుగేళ్లకి అచ్చులో తొలికథను చూసుకొన్న ద్వివేదుల సోమనాథశాస్త్రి రచనా వ్యాసంగం విజయనగరంలో ఆ విధంగా మొదలై విజయవంతంగా కొనసాగింది.


ద్వివేదుల వారి కుటుంబం...

ద్వివేదుల సోమనాథశాస్త్రిని చూస్తే అన్ని కళలున్నాయనుకోం! మాట నెమ్మది. మనిషి సౌమ్యుడు. వెనకటి తరంలో కనిపించే ఆచి తూచి వ్యవహరించే లక్షణం. గబుక్కున మాట తూలకుండా కాస్త నిదానంగా, కొంచెం మొహమాటంగా, గౌరవాన్నీ, ఆదరాభిమానాల్నీ వ్యక్త పరచే ధోరణిలో మూర్తీభవించిన పెద్దరికం లాగా కనిపిస్తారు.

## ఆల్ ఇన్ వన్

1945లో మొదలుపెట్టి ఆయన వందల సంఖ్యలో కథలు రాశారు. నాటికలూ నాటకాలు రాశారు. నాలుగు నవలలూ, మూడు కథా సంపుటాలూ తీసుకొచ్చారు. పేరుమోసిన పత్రికలు వాటికి బహుమతులిచ్చాయి. అంట్యాకుల పైడిరాజు గారి జీవిత చరిత్రను 'పిపాస' పేరుతో సోమనాథశాస్త్రి నవలగా రాస్తే తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించి సత్కరించింది. ఇదో ఎత్తయితే సోమనాథశాస్త్రిలోని కళాత్మక కోణం మరో ఎత్తు. ఆయన మంచి ఫొటోగ్రాఫర్. ట్రిక్ ఫొటోగ్రఫీలో దిట్ట. అలాగే రంగుల రహస్యం తెలిసిన చిత్రకారుడు. యాభయ్యేళ్లనాడే ఆయన పెయింటింగ్స్‌ని లండన్ రాయల్ ఎకాడమీ ఆఫ్ ఆర్ట్స్ మెచ్చుకొని తన గ్యాలరీలో ప్రదర్శించింది. అమెరికాలో సైతం ఆయన చిత్రాలు ప్రశంసలు పొందాయి. విచిత్రం ఏమిటంటే సోమనాథశాస్త్రి కథల్లో, నవలల్లో కేవలం జీవితాన్నెరిగిన రచయితగా మాత్రమే కనిపిస్తారు తప్ప కథా చిత్రణలో చిత్రకళని చొరబడనివ్వలేదు. తనకి చాలా విషయాలు తెలుసుననీ, ఎన్నో వచ్చునని వాటినీ, వీటినీ కలగాపులగం చెయ్యలేదు. ఇన్ని కళల్ని దాచుకున్న ఆయన విజయనగరం-రాయ్‌పూర్ సెక్షన్‌లో గుంభనంగా గూడ్సు బళ్లకీ, పాసింజర్, ఎక్స్‌ప్రెస్/మెయిల్ బళ్లకీ లైన్‌క్లియర్లు ఇచ్చారు. రైల్వేలో సిగ్నలర్‌గా ప్రవేశించి, స్టేషన్ సూపరింటెండెంట్‌గా రిటైర్ అయ్యారు.

## చాయ్...గరమ్ గరమ్ చాయ్


1932 మే 22న విజయనగరంలో జన్మించి, అక్కడే కాలేజీ వరకు చదువుకొన్న సోమనాథశాస్త్రి పౌరాణికులైన తన మాతామహుల ప్రభావంతో సాహిత్యం వైపు ఆకర్షితులై కనిపించిన ప్రతి పుస్తకాన్నీ చదివారు. గంటస్తంభం దగ్గర ఓ ఫొటోగ్రాఫర్‌కు వీరాభిమానిగా మారి ఛాయా చిత్రకళను ఒడిసి పట్టారు. అంట్యాకుల పైడిరాజుగారికి అభిమాన శిష్యుడిగా ఎదిగి ఆర్టిస్టుగా రాణించారు. జీవితంలోని చిన్న చిన్న సరదాల్నీ, అనుభవాల్నీ సరదాగా అక్షర రూపంలో అనువదించడం మొదలుపెట్టి మనసుని గాయపరిచే సంఘటనల్ని చూసి, చలించి, మానవతా కోణంలో కథలు రాశారు.

సోమనాథశాస్త్రి చదుకొంటున్న రోజుల్లో ఆయన అన్నయ్య విజయనగరం రైల్వే స్టేషన్‌లో బుకింగ్ క్లర్క్‌గా పనిచేసేవారు. నైట్ డ్యూటీల్లో ఆయన కోసం సోమనాథశాస్త్రి ఇంటి నుంచి అర్ధరాత్రి ఫ్లాస్క్ నిండా టీ పోసుకొని స్టేషన్‌కు తీసుకువెళ్లేవారు. అది చూసిన వెయిటింగ్ హాలులోని ఓ ప్రయాణికుడు సోమనాథశాస్త్రిని టీ అమ్మే కుర్రాడిగా పొరబడి ''ఏయ్ చాయ్‌వాలా ఇలా రా'' అని పిలిచాడట. ఆ సంఘటన సోమనాథశాస్త్రికి నవ్వు తెప్పించడంతో బాటు 1949లో 'టీ మహత్తు' పేరుతో కథ రాయించింది. 'వినోదిని' పత్రిక దాన్ని ప్రచురించింది. అంతకుముందు నాలుగేళ్ల పాటు చాసోగారితో అక్షతలు వేయించుకుంటూ వచ్చిన సోమనాథ శాస్త్రికి 'టీ మహత్తు' బలాన్నిచ్చింది. ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, యువ, జ్యోతి, ప్రజామత, తెలుగు స్వతంత్ర లాంటి పత్రికలతో బాటు భారతిలో సైతం తన కథల్ని చూసుకొనే స్థాయికి తీసుకు వెళ్లింది.

## డౌన్ టు ఎర్త్

సోమనాథశాస్త్రి కథలన్నీ సాదాసీదా జీవితంలోంచే వచ్చాయి. విజయనగరం మధ్యతరగతి లోగిలిలోని కనిపించే జీవితాలూ, వినిపించే మాటలూ ఆయన రచనల్లో కనిపిస్తాయి. ఇతివృత్తాలు సర్వసాధారణంగా ఉంటాయి. ఆశ్చర్యకరమైన ఆరంభాలూ, ముగింపులూ, ఉత్కంఠ భరితమైన శైలీ విన్యాసాలూ లేని స్వచ్ఛమైన పాత్ర చిత్రణకు ఆయన కథలు పెట్టింది పేరు. సరదా సంఘటనల్ని కథలుగా రాయడానికే పరిమితం కాకుండా జీవితంలోని చీకటి కోణాల్ని సీరియల్‌గా చిత్రించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

భార్య బతికుండగా సేవలు చేయించుకున్న భర్త ఆమె కన్నుమూస్తే తనవంతుగా ఏమీ చెయ్యడు. కొడుకులు కర్మకాండ చేస్తే మౌనంగా చూస్తాడు. మైల తీరిపోగానే రెండో పెళ్లికి సిద్ధమౌతాడు. ఈ సత్యాన్ని 'పసుపు కుంకుమ' కథలో హత్తుకొనేలా చిత్రించిన సోమనాథశాస్త్రి రైల్వేలోని గ్యాంగ్‌మేన్ దురవస్థల్ని 'గ్యాంగ్‌మేన్ గంగ


శాస్త్రిగారు గీసిన వర్ణచిత్రం




## నచ్చినవి

| | |
|---|---|
| కథ | : 'బొండుమల్లెలు' (చాసో) |
| నటీనటులు | : భానుమతి, నాగేశ్వరరావు |
| సినిమాలు | : లైలామజ్ను, మల్లీశ్వరి |
| కథకుడు | : చాసో |
| చిత్రకారుడు | : గురుదేవులు అంట్యాకుల పైడిరాజు |


య్యా'లో ఆర్తిగా చిత్రించారు. ఆ రోజుల్లో పోటీ కథలకు ఉండాల్సిన సెంటిమెంట్‌నీ, తన ధోరణికి భిన్నమైన శైలినీ దొరకపుచ్చుకొని 'చిరిగిన తెరలు' కథను రాసి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక దీపావళి కథల పోటీల్లో మొదటి బహుమతి పొందారు.

### నో కంప్లైంట్స్

''మా రోజుల్లో ...' అంటూ గతాన్ని ఆకాశానికి ఎత్తేస్తూ ఈ తరాన్ని విమర్శించే ధోరణి సోమనాథశాస్త్రిలో కనిపించదు. '' కాలం మారిపోయిందండీ. మా ఆలోచనలు, కథలు పాతబడిపోయేయి. ఇప్పటి వాళ్లకు నచ్చకపోవడంలో ఆశ్చర్యం లేదు''.. అంటూ విశ్లేషణాత్మకంగా అంగీకరించడమే తప్ప ఎవరి మీదా దుమ్మెత్తిపోసే లక్షణం సోమనాథశాస్త్రిలో కనిపించదు. డెభయ్ ఎనిమిదేళ్ల వయసులో సైతం ఎక్కడ సాహితీ సమావేశాలు జరుగుతున్నా వెళ్తుంటారు. ఎన్నో సంస్థలు ఆయన్ని సన్మానించాయి. ఇప్పటికీ అక్షరాల్నీ, రంగుల్నీ విపరీతంగా ప్రేమిస్తూ, అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవిస్తున్న ద్వివేదుల సోమనాథశాస్త్రి తెలుగు కథ శత వార్షికోత్సవాల సందర్భంగా నూరుగురు తెలుగు కథకుల్లో ఒకరిగా నిరుడు సత్కారాన్ని అందుకొన్నారు.

-శ్రీవత్స

## 'టెలిఫోన్'కి ప్రేరణ



గ్రాహంబెల్

**'టెలిఫోన్'** కనిపెట్టి, మానవాళికి మహోపకారం చేసిన శాస్త్రవేత్త. గ్రాహంబెల్‌కి చిన్నప్పటినుంచి రకరకాల పరిశోధనల పట్ల అమితాసక్తి వుండేది.

గ్రాహంబెల్ తండ్రి మూగ, చెవుడున్న విద్యార్థులకు అధ్యాపకుడుగా పని చేస్తుండే వాడు. గ్రాహంబెల్‌కూ అమెరికాలోని బోస్టన్‌లో చెవిటి - మూగ విద్యార్థులకు అధ్యాపకుడిగా ఉద్యోగం ఇప్పించాడు.

గ్రాహంబెల్ అక్కడకు ఉద్యోగంలో చేరి, తండ్రికి తాను ఉద్యోగంలో చేరిన విషయం టెలిగ్రాం ఇవ్వటానికి పోస్టాఫీసుకు వెళ్ళాడు.

అయితే టెలిగ్రాం తీసుకునే గుమస్తా ''మీరు ఓ గంట ఆగండి! వేరే వ్యక్తి టెలిగ్రాం అక్కడికే ఇచ్చాడు. అది పూర్తయ్యాకే, మీ టెలిగ్రాం తీసుకుంటాను'' అన్నాడు.

''గంటసేపు ఆగాలా! అతను టెలిగ్రాం పంపే లైను ఖాళీ అయ్యేవరకు, నా టెలిగ్రాం ఆపుకోవాలా? ఇదేం పద్ధతి?'' అన్నాడు బాధగా గ్రాహంబెల్.

''ఇప్పుడున్న పరిస్థితి అదే! ముందు వచ్చినవారికి ముందు సేవలందుతాయ్. ఇంతకంటే మంచిమార్గం మరొకటి లేదు'' అన్నాడు, గుమస్తా.

గ్రాహంబెల్ మెదడులో ఓ కొత్తఆలోచన వచ్చింది. ''ఇలా గంటలు గంటలు వేచి వుండి, ఒకరి తరువాత ఒకరు వైర్లద్వారా వర్తమానాలు పంపే పద్ధతి కాకుండా, ఒకరితో మరొకరు ఎప్పుడు పడితే అప్పుడు, ఎలా పడితే అలా మాట్లాడుకోవడానికి స్వేచ్ఛ వుంటే ఎంత బాగుండు?'' అనే ఆలోచన వచ్చింది.

ఈ మంచి ఆలోచనా ఫలితమే 1876 మార్చి పదవ తారీఖున మొట్టమొదటిసారి ''మిస్టర్ వాట్సన్ కమ్ హియర్! ఐ వాంటు సీ యూ'' అనే మాటలు తన సహాయకుడైన వాట్సన్‌తో మాట్లాడంతో ప్రారంభించాడు బెల్. ఇక మానవసేవలో ఓ అద్భుతమైన ''బుల్లి పెట్టెలో బూచోడు'' మానవాళికి లభించింది.

## చాప్లిన్ హాస్యం



చాప్లిన్

ప్రపంచపు ప్రసిద్ధ హాస్యనటుడు, చార్లీచాప్లిన్ తెరమీదేకాక, తెరవెనుక, నిత్యజీవితంలో అందర్నీ నవ్వించేవాడు.

ఒకసారి తనకి పోస్టులో ఓ ఉత్తరం కవరులో వచ్చింది.

చాప్లిన్ ఆ కవరు చింపిచూస్తే అందులో కేవలం ఓ తెల్లకాగితం వుంది.

చాప్లిన్ అదేపనిగా దానిని (తెల్లకాగితం) ముద్దు పెట్టుకుంటున్నాడు.

''ఆ కాగితం మీద ఏమీ వ్రాసినట్టు లేదు! అలా ఆ తెల్లకాగితాన్ని ముద్దాడటం ఏమిటి?'' అంటూ అడిగాడు ఓ మిత్రుడు చాప్లిన్‌ను. చాప్లిన్ వెంటనే ''నేను మా ఆవిడ పోట్లాడుకుంటే - మా ఆవిడ అలిగి పుట్టింటికి వెళ్లింది. ఇప్పుడు ఇలా తెల్లకాగితం ఉత్తరంగా పంపిందంటే - ఇద్దరి మధ్యా సంధి కుదిరిందని అర్థమన్నమాట'' అన్నాడు చాప్లిన్ నవ్వుతూ.

ఒకసారి చాప్లిన్ బాల్యమిత్రుణ్ణి చాలా ఏళ్ల తరువాత కలుసుకున్నాడు.

ఇప్పుడు ఆ మిత్రుడు పెద్ద క్రిమినల్ లాయర్‌గా లక్షలు లక్షలు గడిస్తున్నాడు.

మాటల మధ్యలో ఆ లాయర్ మిత్రుడు ''చాప్లిన్ నేను చిన్నవాడిగా నీతో ఆడుకునేప్పుడు - నేను ఓడ దొంగల నాయకుణ్ణయి, అందరినీ దోచుకోవాలనుకునేవాణ్ణి గుర్తుందా?'' అంటూ అడిగాడు.

వెంటనే చాప్లిన్ ''క్రిమినల్ లాయరువై అంతకంటే ఎక్కువగానే దోచుకుంటున్నావు చాలదా? ఇది దానికంటే ఎక్కువేలే'' అన్నాడు చాప్లిన్.

**నాకు నచ్చిన నా కథ**

# లవ్ లెటర్

**- ద్వివేదుల సోమనాథశాస్త్రి**

**ఇలా పోస్టుమన్ కవరు యివ్వడం ఏమిటి. దాని పొట్టచించి కాగితం పైకి లాగి చదవడం మొదలెట్టాడు రమణమూర్తి–**

**"ప్రియమయిన... శ్రీవారికి... ప్రేమతో వ్రాయుముచ్చట్లు..." ఈ ముక్కలు చదివి ఎంత వేగిరం కవరు విప్పాడో... అంతవేగిరం ఆ కాగితాన్ని ఆ చిరిగిన కవర్లో పెట్టేసి ఎడ్రసు చూశాడు.... అతని పేరే?.... కాని అతనికలాటి వుత్తరం ఎవరు వ్రాస్తారు?... అతనిపేరు గలవాడే యింకెవడయినా వుంటే అతనిదవాలి... ఎంతపని జరిగిపోయింది? అతనిదే అనుకుని పోస్టుమన్ యిచ్చేశాడు. చూసుకోకుండా అతనూ చింపేశాడు... ఇప్పుడెలా? అతకడానికి వీల్లేకుండా చిరిగి పోయిందాయె... వాలకం చూస్తే పాపం!... ఏ కొత్త పెళ్ళామో! తన భర్తకి వ్రాసిన వుత్తరంలా వుంది.**

పోనీ ఆ ఆసామిని కాస్త వెతికి అతని చేతిలో పెడితే ఏమనుకుంటాడో? పరాయివాడి వుత్తరం చూసుకోకుండా చింపి చదివినవాడిని ఏమన్న మనిషివయ్యా? అని అడిగేస్తే.. పుణ్యానికివెళితే పాపం వచ్చినట్లవుతుంది... పొరపాటయింది – నీ తోడు నే చదువలేదు – అని ఒట్టు వేసుకున్నా నమ్ముతాడా?

ఏం చేయడమా అని ఆలోచించుకుంటూ ఆ కవర్ని తిరిగి పోస్టుమన్‌కే యిచ్చేదాం అన్న వుద్దేశ్యంతో జేబులో పెట్టుకున్నాడు రమణమూర్తి. కాని జేబులో, ఆ వుత్తరం... ఏదో చెబుతున్నట్టు అనిపించింది. ఆ ఒక్క వాక్యమే అంత రుచిగా వుందికదా యింక ఆ వుత్తరం అంతా చదివితే ఎలా వుంటుందో? అందులోనూ ఒక చిన్నది తన ప్రియుడికి వ్రాసిన ఉత్తర విశేషం! రమణమూర్తి బుద్ధి చలించింది. అదేమిటో చదవాలని అతృత లావయింది. పరాయి ఉత్తరం. అందులోను భార్యాభర్తలు వ్రాసుకున్న వుత్తరం చదువుతావా? చదవచ్చునా? అని మనసు ఒక మూలనుండి పీడిస్తూనే వుంది. కొంతవరకు నిగ్రహించుకున్నాడు. ఏమవుతే అదేకాని, ఆ ఆసామిని వెతికి యిచ్చేద్దామని బయలుదేరి ఆ పరిసరాల్లో వాకబుచేసి లేడనిపించుకొని వచ్చేశాడు.

ఈ మాత్రం దానికోసం కాళ్ళు పీకేట్టు ఎందుకు పోనిస్తూ తిరుగుతావు? ఈ ఉత్తరం అందకపోతే చూసిచూసి మరో వుత్తరం వ్రాసుకుంటుంది. ఏం కొంప మునిగిపోయింది? పద ఇంటికి అని అనుకొని వచ్చేస్తూంటే... జేబు బరువెక్కిపోయింది. మరి వుత్తరాన్ని జేబులో వుంచలేకపోయాడు.

పైకి తీశాడు. ఆ చినిగిన కవర్లోంచి ఆడదాని అందమయిన అక్షరాలు జలజలా క్రిందికి రాలిపోతున్నాయనిపించింది. ఆ వుత్తరం క్రిందపడి పోకుండా పట్టుకొన్నాడు... మళ్ళీ.

"ప్రియమయిన శ్రీవారికి... ఆ వాక్యం అవుపించింది. ఆహా, ఏమీ అదృష్టవంతుడా ప్రియుడు అనుకున్నాడు". ఇంకా ఏం వ్రాసిందో, చూద్దూ కొంప మునిగిపోయిందేమీలేదు. ఆ మాత్రంలో నీదనుకొని కవరు చింపేశావు... అందులో విచిత్రం వుంది. చూస్తే ఏంతప్పు? కావాలని చూశావా ఏం? కాదూ పోదూ అంటే ఎవరితోనూ చెప్పకు ఆ రహస్యం. పోతే ఈ వుత్తరం ఎలాగూ ఆ వ్యక్తికి చేరలేదు కదా! నువ్వు చూడకపోతే మాత్రం ఆ విషయాలు వాడికి తెలిసేడిచాయా ఏం?.... చూడు... ఫరవాలేదు!" అని వెధవకోర్కె తినేస్తుంటే... మెల్లిగా ఒణుకుతున్న చేతులతో ఎవరూ చూకుండా చదవడం మొదలెట్టాడు. రమణమూర్తి.

అందులో–

... "మీరు ఎంత మంచివారండీ, మీ ఉత్తరం చదువుతుంటే – మీతో మాట్లాడుతున్నట్లే వుంది. అయినా కంగాళీపోనిస్తురూ! – నాకు సిగ్గేస్తుంది? మరీ అంతలా వుత్తరాల్లో... వ్రాయెచ్చునా?.... రాత్రిళ్ళు... మిమ్మల్ని... తలుచుకొంటే నిద్ర రాకుండా వుంది. మీరు ఎప్పుడూ నా కళ్ళలోనే ఉంటారు. ఏమిటేమిటో, తలపులతో నన్ను నేను మరిచిపోతూ వుంటాను. ఎంత అదృష్టవంతురాలినో అని అనుకుంటుంటాను. ఇన్నాళ్ళు ఎప్పుడూ మిమ్ముల్ని వదలి వుండలేదుగా... అంచేత భయం భయంగా వుంటోంది. రెక్కలు కట్టుకుని మీ ఒడిలో వ్రాలిపోదామా అనిపిస్తుంది. కాని... ఎలాచెప్పండి?.... ఒంటరిగా... నాకేమీ బాగుండడం లేదు. మిమ్మల్ని చేతులతో చుట్టి మీ హృదయంలో నా ముఖాన్ని దాచుకుందామని వుంది.

–అబ్బ! ఎంత రసికురాలు. ఈమే.... ఎంత అదృష్టవంతుడామె భర్త.... అదీ అలా వుండాలి? దాంపత్యం అంటేను! ఆ ప్రేమ ఏమిటో?... ఇ 'యిది' ఏమిటో!

ఎందుకూ? నాకూ వుంది ఒక పెళ్ళాం!.... వుత్తమొద్దు! ఎప్పుడయినా పుట్టింటికి వెళుతుందా ఒక్క ముక్క వ్రాసి నామొహన పారేస్తుండే అని శతపోరినా వ్రాస్తే కదా! నేనే నాలుగయిదు చేంతాడంతే వుత్తరాలు వ్రాస్తే అప్పుడొక కార్డు ముక్క బహిరంగంగా గొలికి పడేస్తుంది!... అదీ ఏం వ్రాత... నా రాత కాకపోతే... "శ్రీశ్రీ వేదమూర్తులయిన భర్తగారికి మీ చరణదాసి అనేక నమస్కారములు చేసి వ్రాయునది... యిక్కడ అంతా క్షేమము... అక్కడ మీరు క్షేమమని తలుస్తాను...." ఇదీ వరస – ఛీ! ఛీ! ఇదీ ఒక వ్రాతేనా? యిలాగేనా వ్రాసుకుంట! భర్తగారికి... మీ భార్య అని వ్రాయకపోతే అగ్నిసాక్షిగా వివాహమా





డింది కాకపోతుందా? దస్తావేజులా ఉత్తరాల్లోకూడా ప్రతి మాటా వ్రాసుకుంటూండకపోతే కాలదోషం పడుతుందా, పోనీ మొహం ముందు మొహం లేక పోతేపోయింది. చక్కా అలా వుత్తరాల్లోనయినా ప్రబంధనాయకీ నాయకుల్లా వ్రాసుకుంటే ఎంత బావుంటుంది? అయినా అంత అదృష్టం ఎవరికోగాని మనకెక్కడిదిలే...'' అని అనుకుని మళ్లీ చదవటం మొదలెట్టాడు రమణ.

''... మీరు కవర్లోపెట్టి పంపిన ముద్దులు అందాయి. మీరు చెప్పినట్లు, ఆ బుగ్గకీ ఈ బుగ్గకీ పంచేశానులెండి... నన్నిమ్మంటారా! నయం! అయినా క్రిందటిమారు కవరు పట్టనన్ని పంపాను కదా... ఈసారినుండి మన రిఫ్రిజిరేటరులో కొన్ని తాజాగా దాచుకోండి... చాలు... మీకు పిచ్చి మరీ లావయిపోతూంది....

అవునండీ... ఆనాడు మనిద్దరం సినిమాకు వెళ్లాం. ఏమయిందో జ్ఞాపకం వుందా? అప్పుడేమిటయింది?.... ఆటయిపోయి లైట్లువేసినా, అంతజనం వెళ్ళిపోతున్నా కొంతసేపటి వరకూ మనం అలానే ఉండిపోయాం! కదూ! అబ్బ! అందులో కొందరు మనవేపు చూసి నవ్వడం చూస్తే నాకు ఎంత సిగ్గనిపించిందనుకున్నారు!.... నిజంగా ఆ ప్రేమ అలాంటిదేనేమో. మీరు ప్రక్కనుంటే నేను అంతా మరచిపోతాను. ఎంచేతో!....

''ఆహా! ఏమి ప్రతివత! ఏమీ వుత్కృష్టమయిన ప్రేమ. ఏమి ఉదాత్తమయిన భావాలు! ప్రేమ అంటే అలా వుండాలి గాని... మొగుడు రాగానే స్నానానికి నీళ్ళిచ్చేసి, భోజనం పెట్టేసి, మడికట్టుకు నన్నుముట్టుకోకు. నామాలకాకి అని పూజలు చేస్తూ కూచోడమా? నా బొంద దేనికయినా పెట్టిపుట్టాలే!'' అని అనుకున్నాడు.

''...... ఔనండి! మీకు దూరంగా... ఎలావుండగలుస్తున్నానో అంటారా...? మీరు పెట్టిన భిక్షయే... మీ తేజస్సు. మీ అంశ, నా దగ్గర వుంది. అందుకే మీదగ్గర లేకపోయిన నేను నిండుగా, ధైర్యంగా, సంతోషంగా ఉండ గలుగుతున్నాను! అన్నట్టు... అన్న మాట తప్పకూడదు. బాబు పుడితే ఏం బహుమానం యిస్తారు?... చిన్నమాట. నేను రోజురోజుకీ గుండ్రంగా తెల్లగా మారిపోతున్నాను. ఇప్పుడు నన్నుచూస్తే ఆశ్చర్యపోతారు! నా కొంగుపట్టుకు వదలరేమో... వద్దు బాబూ – మీరు మంచి వారు కాదు.. అదే పనిగా చూసి దిష్టికూడా పెట్టిస్తారు''.

ఇలా వుత్తరం చదువుతో వుంటే రమణమూర్తికి ఎక్కడ లేని వుత్సాహం వస్తుంది.

'చూశారా – చూశారా – ఎంత చమత్కారంగా వ్రాస్తుందో అలాటి భావాలు, అంత ప్రేమించిన వాళ్ళకే గాని అందరికీ పుడతాయా మా ఆవిడా వ్రాస్తుంది... ఏమని??–

''ఏమిటో ఈమారు ఎప్పుడులా లేదు! ఏదో భయంగా వుంది. మీకేం మహా రాజులు రోజురోజుకీ నేను నీరసించి పోతున్నాను. వంట్లో నెత్తురు లేదని డాక్టరు చెప్పాడు. చంటివాడికి నాలుగు రోజులయి జ్వరం వస్తూంది...'' ఇదీ వ్రాత... సిగ్గు సిగ్గు... యిది వ్రాతేమిటి? నుదిటి వ్రాత కాకపోతే.

ఆ ప్రియురాలు చూడండి ఎలావ్రాసిందో ఎంత చదివినా యింకా చదవా లనే వుంటుంది అని అనుకుని మళ్ళీ చదవడం మొదలెట్టాడు రమణమూర్తి–

''..... ఏమండీ నన్ను చూసుకున్నట్టే మన గులాబీలను కూడా చూడాలి సుమండీ! నీళ్ళు రోజూ పోయించండి! ఆ పువ్వులన్నీ చూస్తుంటే నేను జ్ఞాపకా నికి వస్తున్నానన్నారు కదా! మరి మొగ్గలాటి నా మనసును వికసింపచేసిన వారు కదా! ఏమంటారు? డబ్బు కావలిస్తే పంపుతామంటారా?..... నాకెందు కండీ. నా మీద ప్రేమ వుంటే చాలు. అది పెట్టి – టెర్లిన్ పాంటు, షర్టు కుట్టిం చుకోండి – లేదూ– మన పాపకి మంచి మంచి బొమ్మలు కొని వుంచండి. ఇక్కడ నాకే ఇబ్బంది లేదు...''

ఆహా! ఏమి త్యాగశీలతో చూడండి – డబ్బు పంపుతానంటే వద్దని ఏ భార్యైనా అంటుందా! ఎంతముద్దుగా వ్రాసింది? మరి తన భార్య అయితే–

''మీకు యింటిసంగతి పట్టదు... అయినా పనిమనిషి వచ్చినప్పుడు జాగ్రత్త సుమండీ... ఆవులు పాడయిపోకుండా చూడండి... పినాసితనం మాని రోజూ పాలు త్రాగండి... అన్నట్టు మన ప్రక్కింటి సీతమ్మగారికి వచ్చేముందు పెద్దయి త్తడి మూకుడూ, జంతికల గొట్టం యిచ్చాను. పని మనిషిని పంపించి వాటిని తెప్పించేయండి. లేకపోతే అవి మనవి కావు. తర్వాత వెంటనే ఓ పాతిక రూపా యలు నా పేర మనియార్డురు చేయండి. డాక్టరు గారికి మందులకి యివ్వాలి'' – ఇదీ వరస. వుత్తరాల్లో కూడా ఈ వెధవ గోలలే! విసుక్కున్నాడు రమణ మూర్తి.

ఆ ప్రియురాలు వ్రాసిన వుత్తరంలోనయితేనో –

''నిజంగా... యివాళరాత్రి నాకెంతో చెప్పలేనంత ఆనందంగా వుందండి – యివాళ ఆ చందమామ ఎలాటి చల్లటివెన్నెల జల్లుతున్నాడో చూడండి... రాత్రి తొమ్మిదయింది. ఏకాంతంగా! నిర్మలంగా! నిశ్శబ్దంగా, చల్లగా హాయిగా వుంది! చూడండి... ఆ చందమామ మేఘాల్లోంచి ఎంత గబగబా పరుగెట్టి వెళ్ళిపోతున్నాడో? ఎక్కడికో? బహుశా తార... దగ్గరిగో ఏమో.... అలాగే నాకూ మీ దగ్గరికి వచ్చేయాలని వుంది. కాని ఆ చంద్రునికోసం కాసారంలో కలువ ఎంత పరితపించిపోతూ వుంటుందో... ఉరకలేస్తున్న చంద్రునికి కనిపిస్తుందా? అలాగే నేనూ మీ కోసం కనీసం మీ పులకలెత్తించే వుత్తరం కోసం ఎదురు చూస్తూ వుంటా... ఏమిటి దగ్గరగా రమ్మంటున్నారా? ఎందుకు? ... ఓహో... తెలుసు తెలుసు వుండండి బుగ్గలికి పెదిమలకి చేదు మందు రాసుకొస్తా...

ఇట్లు
మీ లత

ఈ వుత్తరం అంతా చదివాక రమణమూర్తి అదోలా అయిపోయి–


''హో హో హో... ప్రేమలో కవిత్వం కూడా పుడుతుంది కాబోలు... నిజంగా ఈ వుత్తరం పటం కట్టించి యింట్లో పెట్టుకున్నా తప్పులేదు. కాని పాపం! ఆ అదృష్టవంతుడెవడో వాడు చదువుకుంటే ఎంత ఆనందించి వుండునో? కదా? రాక్షసుడికి రాజకుమారి దొరికినట్టు... నా చేతులో పడింది ఈ వుత్తరం''.

ఇలాగనుకుంటూ ఆ ఉత్తరం జేబులో జాగ్రత్తగా పెట్టుకు ఇంటికి వచ్చాడు రమణమూర్తి. పోస్టుమన్‌గాని, ఎడ్రసులు గల వ్యక్తి గాని, ఎక్కడా కనబడక.

''వచ్చారూ తెల్లావారింది; ఇల్లు వెడలారు – పోనీ యింటికి వచ్చేపుడ యినా కూరలు ఆ చేత్తో పట్టుకువద్దామని అనిపించదు కదా! మళ్ళీ భోజనాల దగ్గర అన్నీ కావాలి... అన్నిటికీ నేనున్నాగా మరి?

అని పలకరించింది వాళ్లావిడ. గుమ్మంలో అడుగుపెట్టగానే అప్పుడే కూరల మనిషితో నయాపైస కోసం పావుగంట సేపు ఘర్షణ పడి అది విని. ఆ ఉత్త రంలో వుద్దేశించిన వ్యక్తి అదృష్టానికి తన దురదృష్టా నికి తల వంచుకు వెళ్ళిపోయాడు లోనికి.

''హా! హతవిధీ!'' ఇలాగేనా యింటికి రాగానే ఒక భార్య తన భర్తని పలకరించే తీరు? ఆమె అయితే? తన భర్త రాకకోసం తలుపు దగ్గర ఎదురుతెన్నులు చూస్తూ, అల్లంత దూరాన కనబడగానే... సముద్ర కెర టాలులా పరుగున ముందుకువచ్చి – పరవశంతో.



## 'ఏ వయసుకి ఆ ప్రవర్తన'



భార్యాభర్తల ప్రేమ ఎప్పటికీ వాడిపోని పుష్పమాలిక లాంటిదే! అది నిత్య నూతనం అని నా ఉద్దేశం. పెళ్లయిన కొత్తల్లోని భావోద్వేగ ప్రకటనలు తర్వాత దశల్లో ఉండకపోవచ్చు. అది అత్యంత సహజమైన పరిణామక్రమమే తప్ప వారి ప్రేమలో మార్పు కాదని నా అభిప్రాయం. ఏ వయసుకు ఆ ప్రవర్తన..ఎప్పుడూ ఒకేలా ఉండం. ఉండలేం. ఉండకూడదు కూడా! భార్యాభర్తల్లో ఈ స్వాభావికమైన మార్పును ఆవిష్కరించడానికే ఈ 'లవ్ లెటర్' రాశాను.


–ద్వివేదుల సోమనాథశాస్త్రి

**94403 87439**


''వచ్చారా?'' అంటూ హృదయం మీద వాలి చేతులు పెనవేసేది.

''నాకోసం ఏం తెచ్చారు? 'సంపెంగలా? మల్లెలా? చామంతులా? అని అడిగి వుండేది! చెయ్యి పట్టుకుని యింట్లోకి తీసుకువెళ్ళి వేడి వేడి కాఫీ యిచ్చి వుండేది అని ఏమిటేమిటో వూహించుకున్నాడు – కాని – వెంటనే –

''ఆ ప్రియుడయితే అవన్నీ తప్పక తెచ్చి ఉండేవాడేమే? మరి నేనూ మా ఆవిడ కోసం సంపెంగలూ, మల్లెలూ, చామంతులూ తెస్తే ఆవిడ అలానే చేసేదేమో' నేను తేనూ లేదు! ఆవిడలా చేయనూ లేదు'' అని అనిపించి నాలిక్కర్చుకున్నాడు.

ఏదో జరిగింది–

మగత నిద్దరాంటే గతంలో కొన్ని మధురస్మృతులు లేకపోలేదు. చెయ్యి వెయ్యగానే ముడుచుకుపోయే 'టచ్ మి నాట్' లాగ మొగ్గని చూసి ఇది పువ్వెప్పుడౌతుందా? అని ఎదురుచూసే తనలాగ లలితా – తనూ ఒకప్పుడుండే వారు. – ఆ రోజులూ, ఆ తీయటి అనుభవాలూ నెమరు వేసుకున్నాడు రమణమూర్తి. మనిషిలో మార్పుకాలంతో పాటు వస్తుందా? వయసుతోపాటు వస్తుందా? అని ఎటూ తేల్చుకోలేక పోయినాడు.

తనకిలాటి భార్య లభించడం ఎంత అదృష్టం? అందమయినది. అన్ని విధాలా అనుకూలమయినది. కాపురానికి వచ్చిన మొదట్లో – ఆ తర్వాత – తామెంత ఆనందంగా గడిపేరు?.... తర్వాత పిల్లలూ, సంసారం... కాలం యిట్టే తిరిగి పోయింది...

అయితే మొదట్లో వున్నట్టు... యిప్పుడెందుకుండ లేకుండా వున్నారు? ఈ ప్రశ్న వాళ్లొక్కరికే కాదు... ప్రతీ దంపతులకూ... కలిగేదీ? ఆ మార్పు ఎలా... ఎక్కడ... ఎందుకు వస్తుంది? ఆలోచించుకుంటేనే ఈ ప్రశ్నా జవాబు దొరకక బాధ. లేకపోతే సహజమయిన ఒక పరిణామం మాత్రమే.

పెళ్ళయిన క్రొత్తల్లో పది మాటలకి ఒకమాట మాత్రం జవాబు చెప్పే తన భార్యేనా ఈమె!

సన్నగా, నాజూకుగా, ముగ్ధమోహనాకారంతో, లేత యవ్వనంతో రమ్మనగానే మృదువుగా ముడుచుకుపోయే. గులాబీయేనా ఈమె?

తన వయిపు సూటిగానన్నా చూడకుండా గట్టిగా మాటాడితే బెదురు చూపులు చేసే అబలేనా ఈమె?

మరి తను మాత్రం ఎంత మారిపోలేదు?

ఇలా అందరూ వూహించుకున్నట్టే రమణమూర్తి కూడా ఆలోచనల్లో పడిపోయాడు...

పరధ్యాన్నంగా చేయి కడుక్కుని గదిలోకి నడిచాడు. కాస్సేపటికి లలిత. అదే రమణమూర్తి భార్య వచ్చి ఈయన పరధ్యాన్నం అదీ, చూసి బుగ్గ మీద వేలేసుకుంది.

''అదేమిటి ఇందాకటినుండి చూస్తున్నాను. ఏమిటోలా వున్నారు?'' అంది నవ్వుతూ.

''అబ్బే ఏమీలేదు... యివాళ భోజనం షడ్రసోపేతంగా వుంది సుమా... ఏదీ ఆ చేత్తోనే... ఆకూ... చెక్కా... కూడా'' అని అన్నాడు.

''ఇంకా నయం. నోటికీ అందివ్వమన్నారు కాదు. అయినా ఏమిటీవేళ కోరికలు కూడా చిత్రంగా వున్నాయి''.

''ఇవాళేమిటో నిన్ను చూస్తుంటేనూ.... అయితే లలితా నేనోటి అడుగుతాను చెబుతావా'' అని అడిగింది.

ఆమె ఆశ్చర్యపోతూ 'అడగండి చెబుతా' నంది.

''ఏం లేదు – నేనంటే మొదట్లో లాగే నీకు నా మీద ప్రేమవుందా?'' అని అమాయకంగా అడిగేడు.

అది విని నవ్వుతూ – వెటకారంగా.

''ఎవరికీ... నాకా మీ మీదా...ప్రేమా... బావుంది మీ ప్రశ్న... ఎవరయినా వింటే నవ్విపోతారు... ఇన్నాళ్ళకు వచ్చిందా మీకీ సంశయం....'' అంది.

''హాస్యం కాదు లలితా... నిజం చెప్పు...'' మనం మారలేదంటావా?''

''మారకుండా వుండిపోతామా? వయసుతో పాటు మనమూను''.

''అది సరే... అప్పటి కోర్కెలూ, అవీ ఏమయిపోయినాయి?''

''ఏమీ అవవుకాని ఏ వయసుకి తగ్గ. అభిరుచులూ, అలవాట్లూ ప్రవర్తనా ఆ వయసుకు వుండాలి. కోర్కెలు ఎప్పుడూ వున్నా, పరిస్థితులను బట్టి మనసులోనే వుంచుకోవాలి. వాటిని అప్పటిలాగే తీర్చుకోచూస్తే హర్షించదు!''

''భార్యాభర్తల మధ్య కూడానా?''

''తప్పదు మరి. ఇద్దరి మధ్యా ఎంతో అన్యోన్యత వున్నా, ప్రేమవున్నా చిన్నప్పటిలాగ యిప్పుడు పిల్లల ముందూ, పెద్దల ముందూ ప్రకటించుకోగలరా?

''పోనీ విసుగూ చిరాకూ ఎందుకు వస్తుందంటావు?'' అని అడిగాడు.

''విసుగేమిటండి... మీరు ఆఫీసులో పనిచేస్తూంటారనుకోండి – అప్పుడు పిల్లలు దగ్గరికివచ్చి అనవసరంగా అడుగుతుంటే ఎందుకు కసురుకుంటారు? వాళ్ళమీద ప్రేమా, అభిమానమూ లేకనా... అలాగే నేనూను. ఏమిటో పని తెమలక అలా కసురుకుంటాను గాని యింకేముంటుంది? అయినా యివాళేమిటి యిలా అడుగుతున్నారు?'' అని అంది.

''ఏమీలేదు. యివాళ పోస్టుమన్ నాకో ఉత్తరం యిచ్చాడు. అడ్రసు చూస్తే నాదే... కాని. లోన వుత్తరం చూస్తే. పాపం... ఎవరో అమ్మాయి తన భర్తకి వ్రాసిన ప్రేమలేఖ అది....

''ఎవరిదో అని ఎందుకు విచారిస్తారు?... మీదేనేమో?'' అని హాస్యమాడింది.

''బావుంది వేళాకోళం! అయినా అంత అదృష్టం కూడానా?'' అన్నాడు వెటకారంగా.

''అయ్యో పాపం! కానీండి. ఏం చేస్తాం... ఆ తర్వాత–''

''నీకంతా వెటకారమే కాని. నిజంగా ఎంత బాగా వ్రాసిందనుకున్నావు. ప్రేమ అంటే అలా వుండాలి''.

అయితే వాళ్ళిద్దరూ భార్యాభర్తలయి వుండరు.'' అంది నవ్వుతూ.

''ఏం భార్యాభర్తల మధ్య అలాటి ప్రేమ వుండదా!''

''ఏమో నాకేం తెలుసు? మీకే తెలియాలి.... ఊ... ఇంతకీ ఆ ఉత్తరం మీరు చదివారా?''

''మరేం చేయను? నాదే అనుకొని చింపేశాను కదా?''

''అయితే మాత్రం! మొగుడూ పెళ్ళాల వుత్తరం అని తెలిశాక మళ్ళీ కవర్లోనే పెట్టేయలేక పోయారా?''

''మొదట అలానే చేశాను... వూరల్లా తిరిగాను. ఆ ఆసామీ ఎక్కడ కనబడలేదు...''

''అంతవరకూ బాగానే వుంది...''

''మొదట ముక్కచదివేనేమో... మరి వుండబట్టలేక పూర్తిగా చదివేశాను..'' చదివి. మీకు వ్రాసినట్టే బుజాలెగరేస్తున్నారు! అవునా?''

''చదివిచూడు... నీకే తెలుస్తుంది!... నువ్వెప్పుడయినా యిలా వ్రాశావా?''

''భార్యాభర్తలు వ్రాసుకొనే వుత్తరాలు చూడ్డం ఏమిటి? నాకు సిగ్గేస్తుంది ''

''ఫరవాలేదు చూడు'' అని ఉత్తరం అందించాడు.

''ఏమిటంత పొగుడుతున్నారు మహా... అని వుత్తరం చూసి జవాబు చెప్ప


డానికి బదులు విరగబడి నవ్వడం మొదలెట్టింది. రమణమూర్తికి ఏమీ అర్థం గాక ఆశ్చర్యపోయాడు.

''అలా నవ్వుతావేమిటి? – పాపం ఆ ఉత్తరం కోసం అతనెంత ఎదురు చూస్తూ వుంటాడో? నా దగ్గర వుండిపోయింది కదా అని నేను విచారిస్తూ వుంటేను!'' అని అన్నాడు.

అది విని ఆమె నవ్వుతూ.

''ఆ వుత్తరం మీదే అయితేనూ – ఎవరో ఎందుకు ఎదురు చూస్తారండీ!'' అని అంది.

''మళ్ళీ వేళాకోళమా? ఏమిటి నువ్వంటున్నది?''




''వేళాకోళం కాదండీ. నిజంగా ఆ వుత్తరం మీదే?'' అంది నవ్వాపు కుంటూ.

''ఏమిటి? ఆ వుత్తరం నాదా? ఇన్నేళ్ళువచ్చాక నా కెవరు రాస్తారు లవ్ లెటర్... అయితే మీ చెల్లె అయివుండాలి?.... ఏ మొగుడూ దొరక్క–''

''మరేం! అదొక్కటే... తరువాయి... నేననేది. అది కాదు.. ఆ వుత్తరం నేను వ్రాసినదేనండీ అని. నేను మొదటిమారు పురిటికి మా వాళ్ళింటికి వెళ్ళినప్పుడు మీరు ఉత్తరాలు వ్రాయి వ్రాయి అని ఒకేపనిగా వ్రాస్తూ వుంటే. ఒకనాడు తీరు బడిగా కూర్చుని, పుస్తకాల్లో చదివిందంతా జ్ఞాపకం తెచ్చుగొని... తమాషాగా, ఆ ఉత్తరం మీద వ్రాశాను. ఆ ఉత్తరమే ఈ ఉత్తరం!''

అని ఆమె అనేసరికి రమణమూర్తి నమ్మలేక–

''ఇది నువ్వు వ్రాసినదా? యిన్నాళ్లుపోయాక యిప్పుడా వచ్చింది?''

''అదే నేనూ అనుకుంటున్నాను... లేకపోతే ప్రేమలేఖ కోసం వాచిపోయి మీరే ఆ ఉత్తరం కవర్లో పెట్టుకు. మీ ఎడ్రసు వ్రాసుకొని పోస్టు చేసుకోలేదు కదా?'' అంది నవ్వుతూ.

''బావుంది! నీ హాస్యం. అసలు యిలాంటి వుత్తరం నాకందనిదే?'' అవు నండీ... అప్పట్లో నేనంత కష్టపడి వ్రాసిన ఉత్తరము అందిందా? అని అడిగితే లేదని మీరు చెప్పారుగా... జ్ఞాపకం తెచ్చుకోండి!''

''అయితే... నీ పేరు ''లలిత'' కాబోలునే... యిందులో ''లత'' అని వుందే?

''అయ్యో! సంబరమా? నేనే అలా తమాషాకి మధ్య అక్షరం వదిలేసి ''లత'' అని ముద్దుగా వ్రాశానండి... మీరు కూడా అప్పుడప్పుడు నన్ను అలానే పిలిచే వారు కదండీ! అన్నీ యింత వేగిరం. మరిచిపోతే ఎలా? ఆ రోజులు ఎంతహా యిగా వుండేవి...''

''అవునవును! జ్ఞాపకం వచ్చింది... పదేళ్ళక్రిందట. నువ్వు మీ వాళ్ళింటికి వెళ్ళినప్పుడు వుత్తరం వ్రాయలేదని నేనూ, వ్రాసేనని నువ్వూ వాదించు కున్నాం... అయితే ఆ ఉత్తరమే నన్నమాట తిరిగి తిరిగి యిన్నాళ్ళకు చేరింది! ఏదీ కవరుతే. ఎన్నాళ్ళ క్రిందటి ముద్రో చూద్దాం!

అని ఆ కవరు చూసి–

''చూశావా కవరునిండా ముద్రలే... నేను చూడనేలేదు. పోనీ మనిద్దరం.. ''హనీమూన్'' తిరగకపోయినా, మన లవ్‌లెటర్ ఆ పని చేసుకు వచ్చింది!''

''మరేం. చంకలో బిడ్డని పెట్టుకు వూరల్లా వెదికినట్టు మీ కోసం. మీరే. ప్రొద్దుట నుండీ తిరిగారు!'' అంది నవ్వుతూ.

ఆ మాటలు వినిపించుకోకుండా.

''అయితే ఆ లతని నువ్వేనన్నమాట! ఆ లవ్‌లెటర్ నాకేనన్న మాట!... ఆ ప్రియుణ్ణి నేనే నన్నమాట... అహ ఎంత అదృష్టవంతుణ్ణి...'' అని పరవశంతో అన్నాడు.

''ఇంకా నమ్మకం లేదాండీ?''

''లతా...''

''ఏమండీ...''

''మరిప్పుడల్లా వ్రాయడం లేదేం?''

''మీరిప్పుడలా అడగడం లేదేమిటండీ? అయినా... యింకా చిన్న వాళ్ళమా? అలా వ్రాసుకుంటే ఏం బావుంటుందండీ?... పైకి ప్రదర్శించే రోజులు పోయి మనసులో వుంచుకోవలసిన రోజులు వచ్చాక!''

''నిజం... అంతేగాని మనం మారలేదు కదూ? లతా!''

''ఎన్నటికీ మారం!''

''ఏదీ ఆ వుత్తరం నువ్వు చదువు''

''బావుందండీ మీరు మరీనూ. అలాటి వుత్తరం యింకా వుంచుతారా ఏం?... చించేస్తాను..''

''ఆc... ఆc.... వద్దు! ఆ వుత్తరం జాగ్రత్త సుమా? ఈ వెండిభరిణిలో పది లంగా దాచు దీనిని పూజా పుష్పాలకన్నా పవిత్రంగా దాచుకుందాం..''

''చాల్లెండి... మీరు మరీనూ... ఎవరయినా వింటే నవ్విపోతారు?'' అని ఆ వుత్తరం అతని చేతుల్లో పెట్టబోయేసరికి రమణమూర్తి ఆ చేతిని అందుకుని – లలితని దగ్గరగా తీసుకున్నాడు... లలిత వద్దంటూ బెట్టు చేస్తూనే....

❑